మినీ కథ

# ఎంతెంత పందెం?

ఎల్. కె. అనూరాధ




థియేటర్ ముందు ఆటో దిగేనరికి కౌంటర్ మూసేయబోతున్నారు. వరుగులాంటి నడకతో వెళ్ళి టికెట్ కొన్నాను. టికెట్ ఇస్తూ కౌంటర్‌లో వ్యక్తి నావైపు ఆశ్చర్యంగా చూశాడు.

ఒంటరిగా ఓ అమ్మాయి నూన్‌షోకి, అందునా ఓ మలయాళీ సినిమాకి వచ్చినందుకు ఆశ్చర్యపోయినట్టున్నాడు.

నేను అదేం పట్టించుకోకుండా థియేటర్ లోపలికి వెళ్ళాను.

అప్పటికే న్యూస్‌రీల్ అయిపోయి సినిమా మొదలైంది. నేను వెతుక్కుంటూ వెళ్ళి సీట్లో కూర్చున్నాడు.

ఒంటరిగా వెళ్ళి సినిమా చూసి రాగలనని ఫ్రెండ్స్‌తో నేను కట్టిన పందెం గెలవబోతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. నేను చేసిన పని చెపితే మా ఫ్రెండ్స్‌కి కలిగే ఆశ్చర్యం గురించి ఆలోచిస్తున్నా.

ఇంతలో ఎవరో కాలు తొక్కినట్టయింది.

చూస్తే ఎవరో ఒకతను చీకటిలో తడుముకుంటూ వచ్చి నా వక్కనే ఖాళీగా ఉన్న సీట్లో కూర్చున్నాడు.

కాలు తొక్కినందుకు సారీ కూడా చెప్పనందుకు కోపం వచ్చింది. మనసులోనే తిట్టుకున్నాను.

మరికొద్దిసేపటికి నా చేతికి మరెవరిదో చేయి తగిలినట్టు అయితే షాక్ తగిలి చూశాను. వక్కన కూర్చున్న శాల్తీ తన చేతిని అప్పుడే నెమ్మదిగా వెనక్కు తీసుకుంటున్నాడు.

"ఏం నాయనా? ఒళ్ళు ఎలా ఉంది?" అన్నాను నెమ్మదిగా.

ఏం మాట్లాడకుండా ముంగిలా కూర్చున్నాడు. అతనెవడో మరీ అమాయకుడిలా అనిపించాడు. అయితే ఓ ఆట పట్టిస్తే?

కావాలనే కాలు తొక్కాను. గబుక్కున కాలు వెనక్కు లాక్కున్నాడు. అబ్బాయి అంత పిరికిగా కనిపించేసరికి నేను కొంచెం విజృంభించాను. నెమ్మదిగా నా చేయి తీసుకువెళ్ళి అతని ఒళ్ళో వేశాను.

అంతే! గబుక్కున లేచి హడావిడిగా బయటకు వెళ్ళిపోయాడు. నాకు ఆపుకోలేనంత నవ్వు వచ్చింది.

ఇంటర్వెల్ అయిపోయింది. మళ్ళీ సినిమా మొదలైంది. అయినా నా వక్క సీటు ఖాళీగానే ఉంది. నా దెబ్బకు భయపడి థియేటర్ వదిలి పారిపోయినట్టున్నాడు.

రేపు నా ఫ్రెండ్స్‌కి ఈ విషయం చెప్పి ఎలా నవ్వించవచ్చో ఊహించుకుంటే చెప్పలేనంత నవ్వు వచ్చింది.

యూరినల్స్‌కి వెడదామని లేచి బయటకు వచ్చాను. అక్కడ నేను చూసిన వింతని నా కళ్ళు నమ్మలేకపోయాయి. ఫాంట్ జిప్ లాక్కుంటూ ఆడవాళ్ళకు కేటాయించిన యూరినల్స్‌లోంచి వస్తూ కనిపించాడు ఒకడు. ఆ నడక అదీ చూస్తే నా వక్క సీటులో ఉండాల్సిన శాల్తీలానే కనిపించాడు.

అంటే గురువుగారు నేను అనుకున్నంత అమాయకుడు కాదన్నమాట!

నేను లోపలికి వెళ్ళి కూర్చునేసరికి వక్కసీటు శాల్తీ ఉన్నాడు.

ఈసారి మరింత ఆట పట్టించాలనుకున్నా.

"ఏం గురువుగారూ, ఏంటా పని?" అన్నాను నెమ్మదిగా.

నా వైపు ఒకసారి చూసి కుర్చీకి ఒకమూలగా జరిగి ఒదిగి కూర్చున్నాడు. మరోమాట అంటే ఏడ్చేలా ఉన్నాడు. 'మరీ ఇంత చవటతో నాకేం పని' అనుకుని సినిమా చూడసాగాను.

సినిమా అయిపోవచ్చింది.

నా వక్క సీటు శాల్తీ గబగబా లేచి వెళ్ళబోతున్నాడు. ఆ శాల్తీని ఏడిపించేందుకు ఇదే చివరి ఛాన్స్ కదా అని కాలు అడ్డం పెట్టాను. కాలు తట్టుకుని బోర్లా పడబోయాడు. చటుక్కున లేచి ఒడుపుగా పట్టుకున్నాను.

ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది.

నా చేతుల్లోంచి లేవకుండా ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఎలా సముదాయించాలో అర్థం కావడంలేదు. పైగా ఎవరన్నా చూస్తే అదో భయం.

ఇంతలో హఠాత్తుగా లైట్లు వెలిగాయి.

అప్పటికి ఏడుపు ఆపి నా ముఖంలోకి చూసిన ఆ శాల్తీ "నువ్వు... నువ్వు..."

నేను అదే పరిస్థితిలో "నువ్వు... నువ్వు..." అన్నాను.

"రాజా? నువ్వు... ఈ ఆడవేషంలో..."

"లక్ష్మీ? నువ్వు ఈ అబ్బాయి డ్రస్‌లో..."

థియేటర్‌లో మిగిలిన వాళ్ళు మమ్మల్నే వింతగా చూస్తున్నట్లు అప్పటికి గాని మాకర్థం కాలేదు.

వెంటనే లక్ష్మి చేయి పట్టుకుని పరుగు పరుగున తీసుకొచ్చి ఆటోలో కూలేసి పోనివ్వమన్నాను.

ఆటో డ్రైవర్ మావైపు వింతగా, అనుమానంగా చూస్తూ స్టార్ట్ చేశాడు.

కొంత దూరం పోయిం తరువాత కాని కుదుట పడలేదు మేము.

"లక్ష్మీ? నువ్వు ఇదేం వేషం?"

"కాలేజీలో సాయంత్రం ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్ ఉంది. నా డ్రెస్ ఎంతవరకు సూటైందో చూద్దామని ట్రయల్‌గా సినిమాకు వచ్చాను. మరి నువ్వు...?"

"అమ్మాయి వేషంలో మలయాళం సినిమాకి వెళ్ళి రాగలవా అని పందెం వేశారు మా ఫ్రెండ్స్. ఓస్, అదెంత పని అని వచ్చా."

మా ఇద్దరికీ నవ్వు ఆగలేదు.

లక్ష్మి మరెవరో కాదు, నా మేనత్త కూతురు, మరో నాలుగైదేళ్ళలో నాకు కాబోయే భార్య.

*